సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

హ్యాపీ బర్త్‌డే జగనన్న



కేక్ కట్‌చేస్తున్న మహిళలు

ఎంవీపీకాలనీ: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఆదర్శనగర్‌లో ఉత్సాహంగా నిర్వహించారు. జిల్లా మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ 17వ వార్డు నాయకురాలు పిల్లా సత్యవతి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వారితో కలిసి కేక్ కట్‌చేసి జగనన్నకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. సత్యవతి మాట్లాడుతూ అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా రుణాలు వంటి పథకాల ద్వారా వైఎస్ జగన్ మహిళలకు అందించిన ప్రోత్సాహం చిరస్మరణీయమన్నారు. స్థానిక మహిళలంతా వైఎస్సార్‌సీపీ వెంటే ఉన్నారన్నారు. పార్టీ మహిళ కార్యకర్తలు చంద్రిక, సంధ్య, సునీత, లక్ష్మి, విజయ, దాలమ్మ, మమత, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం దగ్గరలోని ఈవీఎం గోదాంను శుక్రవారం కలెక్టర్ హరేందిర ప్రసాద్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సిబ్బందితో గోదాం ప్రధాన ద్వారానికి వేసిన తాళం సీల్‌ను తీయించారు. గోదాంలో ఉన్న వీవీప్యాట్‌లు, ఈవీఎం బాక్సులను, లోపల సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. గోదాం భద్రతపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, ఎన్నికల విభాగం, రెవెన్యూ అధికారులు ఆయన వెంట ఉన్నారు.

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి

విశాఖ సిటీ: విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును పొడిగించాలని వీఎంఆర్‌డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ప్రస్తుతం ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 ఏళ్లుగా ఉందని, దాన్ని 62 ఏళ్లకు పొడిగించాలని అసోసియేషన్ అధ్యక్షుడు యు.వి.ఎస్.ఆర్.ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిశంకర్ వినతిపత్రం అందజేశారు.

సాగరతీరంలో ఉగాది సంబరాలు నిర్వహించాలి

బీచ్‌రోడ్డు: సందర్శకులను ఆకర్షించేలా ఆర్కే బీచ్ వద్ద ఉగాది సంబరాలు నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం నగరంలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. మార్చి 29న ఉగాది సంబరాలను ఏర్పాటు చేసి సినీ రంగ సింగర్ల ద్వారా మ్యూజికల్ నైట్ నిర్వహించాలని కోరారు. తెలుగు సంప్రదాయ వంటకాలను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించాలన్నారు. పోర్టు అధికారులతో మాట్లాడి విశాఖలో క్రూజ్ టూరిజం కొనసాగించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఫెడరేషన్ హోటల్స్ అండ్ టూరిజం సబ్ కమిటీ చైర్మన్ ఎం.వి.పవన్ పాల్గొన్నారు.

ఫార్మసీ కాలేజీలో ప్రత్యేక ప్రసంగాలు

విశాఖ విద్య: ఏయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ పూర్వ విద్యార్థి, అమెరికాలో క్లినికల్ ఫార్మకోలజీ సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ ఎన్.వి.టాటా తాను చదువుకున్న కాలేజీని శుక్రవారం సందర్శించారు. ప్రొఫెసర్ వి.సుబ్బరావు ఆడిటోరియంలో బయో అనలిటికల్ టెక్నిక్స్, ఫార్మాకోకినెటిక్స్–ఇండస్ట్రీ అనువర్తనాలపై ఆయన ప్రత్యేక ప్రసంగాలు ఇచ్చారు. ఎం.ఫార్మసీ, ఫార్మడీ విద్యార్థులకు ఈ లెక్చర్స్ ఎంతో ఉపయోగంగా నిలిచాయి. అనంతరం ఆయన ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.గిరిజాశంకర్, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ ఈశ్వర్‌కుమార్‌లతో డాక్టర్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. వర్సిటీ తరఫున ఆయనను సత్కరించారు. కాలేజీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కలుషితాహారంతో జాగ్రత్త..!

నిల్వ ఆహారం విక్రయిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు

- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులతో కలకలం
- ఏడాదిలో 632 దాడులు.. 92 కేసులు



ఓ హోటల్‌లో ఫుడ్ శాంపిల్ సేకరిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్



పెదవాల్తేరులో ఫుడ్ సేఫ్టీ కార్యాలయం



కల్తీ నూనె తనిఖీ చేస్తున్న అధికారులు

బీచ్‌రోడ్డు: విశాఖలోని పలు హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. ముందు రోజు ఆహారాన్ని సైతం ఫ్రిజ్‌లో నిల్వ చేసి వినియోగదారులకు వడ్డించేస్తున్నారు. మాంసాహారాన్ని కూడా ఇలాగే నిల్వ చేసి అందించడంతో వినియోగదారులు అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్న సంఘటనలు కోకొల్లలు. వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో బిజీబిజీగా పరుగులు పెడుతున్న ప్రజలు బయట ఆహారానికి అలవాటు పడ్డారు. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు నగరవాసుల తాకిడి బాగా పెరిగింది. ఇక ఆన్‌లైన్ ఫుడ్ కోసమైతే చెప్పాల్సిన అవసరం లేదు. రకరకాల యాప్స్ ద్వారా నచ్చిన ఆహారాన్ని ఆర్డర్ చేసుకొని తింటున్నారు. అయితే మనం తినే ఆహారం ఎంత వరకు ఆరోగ్యకరమనే విషయం చాలా మందికి తెలియదు. తింటున్నది కలుషిత ఆహారమని తెలిస్తే.. ఎవరికి, ఎలా ఫిర్యాదు చేయాలనే దానిపై అవగాహన చాలా మందిలో లేదు. దీంతో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు నచ్చినట్లు ఆహారాన్ని తయారు చేసి, నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు.

నిల్వ ఆహారం.. అనారోగ్యకరం

బయట ఆహారానికి జనం అలవాటు పడటంతో రెస్టారెంట్లు, హోటళ్ల వారు సొమ్ము చేసుకుంటున్నారు. పాడైన పదార్థాలతో ఆహారం వండి, నిల్వ చేసి మరుసటి రోజు వినియోగించడం వంటివి చేస్తున్నారు. వాస్తవానికి నిల్వ ఉంచిన ఆహారాన్ని వేడిచేసి తినరాదని డైటీషియన్లు హెచ్చరిస్తున్నా.. హోటళ్ల నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు. స్టార్ హోటళ్లతోపాటు ఒక మోస్తరు హోటళ్లలో కూడా ముందురోజు ఆహారం ఫ్రిజ్‌లో నిల్వ చేసి వినియోగదారులకు విక్రయించడం రివాజుగా మారింది. ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసినపుడు ఆహారంలో నాణ్యత ఎంత ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. నాసిరకం ఆహారం తినే ప్రజలు అనారోగ్యంతో ఆస్పత్రి పాలవుతున్నారు.

ఆహారంలో కల్తీ నూనె..

నిల్వ ఆహారం విక్రయించడం ఒకటయితే.. కల్తీ నూనె వినియోగించి ఆహారం తయారు చేయడం మరో ముచ్చట.. కల్తీ నూనెతో వండిన ఆహారం తినడం వల్ల క్యాన్సర్, జీర్ణకోశ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశముందని వైద్యులు చెబుతున్నారు. ఇటీవల ఆహార భద్రత అధికారులు సైన్ ట్రైన్ రెస్టారెంట్, వైజాగ్ కెమిస్ట్రీ హోటళ్లలో చేపట్టిన దాడుల్లో కల్తీ నూనె పెద్ద మొత్తంలో పట్టుబడింది. నూనెలోని టోటల్ పోలర్ కాంపౌండ్ వాల్యూ 36.5 శాతం ఉన్నట్లు గుర్తించి వాటికి జరిమానా విధించారు. టీపీసీ వాల్యూ అధికం ఉన్న నూనెతో తయారీ చేసిన ఆహారం తినటం వల్లశరీరంలో ఫ్రీ రాడికల్స్ పెరిగి రక్తనాళాలు గట్టిపడటం అల్జీమర్స్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.

హోటళ్లపై దాడులు..

గడిచిన ఏడాది కాలంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు వందల సంఖ్యలో దాడులు నిర్వహించారు. నగరంలోని ప్రముఖ హోటళ్లలో సైతం కలుషితాహారం కనిపిస్తోంది. గతంలో ఆర్‌కే బీచ్ రోడ్డులోని పాండురంగాపురంలో గల బార్బిక్యూ నేషన్ హోటల్‌పై, ఇటీవల కామత్ హోటల్‌పై దాడులు చేసిన అధికారులు కల్తీ ఆహారాన్ని గుర్తించారు. బార్బిక్యూ నేషన్‌పై కేసు నమోదు చేసి రూ.2 లక్షల జరిమానా కూడా విధించారు. కామత్ హోటల్ నుంచి ఆహారాన్ని సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. ఈ ఏడాది కాలంలో అధికారులు జిల్లా వ్యాప్తంగా 632 దాడులు చేయగా.. 224 శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం పంపించారు. వాటిలో 92 శాంపిల్స్ కల్తీ అని తేలడంతో ఆ రెస్టారెంట్లు, హోటళ్లపై కేసులు నమోదు చేశారు. కల్తీ ఆహారం విక్రయిస్తున్న వారికి భారీ మొత్తంలో జరిమానా కూడా విధిస్తున్నారు.

కల్తీ ఆహారంపై ఫిర్యాదు చేయండి

ఆహార పరిరక్షణ, ప్రమాణాల చట్టం 2006, 2011 ప్రకారం తినే ఆహారం.. తాగే పానీయాలు ఏదైన కలుషితం చేస్తే వాటి మీద ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవచ్చు. నగరం, జిల్లాలో ఏ హోటల్‌లో అయినా నిల్వ ఉంచిన, కల్తీ ఆహారం విక్రయిస్తున్నా.. ఫుడ్ సేఫ్టీ అధికారులకు వినియోగదారులు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

	ఫుడ్ సేఫ్టీ అధికారి పేరు	ఫోన్ నంబర్
అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్	జి.ఎ.బి.నందాజీ	98490 47761
ఆఫీసర్ డివిజన్-1	ఎస్.ఆనందరావు	97736 83667
ఆఫీసర్ డివిజన్-2	పి.శ్రీను	95667 60283
ఆఫీసర్ డివిజన్-3	జి.వి.అప్పారావు	99121 99284

‘జిజ్ఞాస’తో గ్రామీణ విద్యార్థులకు తోడ్పాటు



మాట్లాడుతున్న ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన్

విశాఖ విద్య: విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేసేలా ఐఐపీఈ ఆధ్వర్యంలో ‘జిజ్ఞాస’ అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సంస్థ డైరెక్టర్ ఆచార్య శాలివాహన్ శ్రీవాస్తవ తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రాంగణంలోని ఐఐపీఈ క్యాంపస్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన కార్యక్రమ వివరాలు వెల్లడించారు. సైన్స్, గణితం సబ్జెక్టులపై అవగాహన పెంచుకోవడం ద్వారా భవిష్యత్ చదువులకు పటిష్టమైన పునాదులు వేసుకోవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుల్లో రాణిస్తున్న అనేక మంది విద్యార్థులకు మరింత తోడ్పాటు అందించేలా సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ప్రోగ్రాం అమలు చేస్తున్నామన్నారు. కాలేజ్, స్కూల్ టీచర్స్ ఎడ్యుకేషన్ అండ్ అకడమిక్ మెంటరింగ్, స్టూడెంట్స్ ఫెలోషిప్ ప్రోగ్రాంలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ఈ నెల 21 శనివారం నుంచి ఈ నెల 23 వరకు తొలి విడతలో నిర్వహించే శిక్షణకు విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని వివిధ పాఠశాలలు, కాలేజీలకు చెందిన 9 నుంచి 12వ తరగతి వరకు చదువుకునే 25 మంది విద్యార్థులు, వారికి పాఠాలు బోధించే 25 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఎంపిక చేశామని శ్రీవాస్తవ తెలిపారు. శిక్షణలో భాగంగా వీరికి రూ.2 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందిస్తామన్నారు. సబ్బవరం క్యాంపస్‌లో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభం కాగానే విద్యార్థుల సంఖ్యను పెంచుతామని పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ విద్యార్థులే లక్ష్యంగా ఐఐపీఈ నైపుణ్య హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ఐఐపీఈ డీన్ ఆచార్య విజయ్‌కుమార్ కొప్పారపు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసమే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సైన్స్‌పై అవగాహన, జిజ్ఞాసను పెంచే శిక్షణ తరగతులు నిర్వహిస్తామని కో ఆర్డినేటర్లు ప్రొఫెసర్ పాలమరశెట్టి అపారోయ్, ప్రొఫెసర్ రంధి రామునాయుడు చెప్పారు. శిక్షణ కోసం వచ్చిన వారందరికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

‘మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డ్’ ఆవిష్కరణ



ఫ్యామిలీ కార్డ్ ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చన్నాయుడు, ఆస్పత్రి వైద్యులు

ఎంవీపీకాలనీ: వైద్య సేవలను అందరికీ చేరువ చేసేందుకు మెడికవర్ హాస్పిటల్ రూపొందించిన ‘మెడికవర్డ్ ఫ్యామిలీ కార్డ్’ను రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్థక శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు శుక్రవారం నగరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతోపాటు ప్రైవేట్ ఆస్పత్రులు వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేలా కృషి చేయాల్సి ఉందన్నారు. ఈ దిశగా రోగులకు నాణ్యమైన సేవలందిస్తున్న మెడికవర్ హాస్పిటల్ యాజమాన్యాన్ని అభినందించారు. రూ.500తో మెంబర్‌షిప్ కార్డు తీసుకుని దేశవ్యాప్తంగా ఉన్న 25 మెడికవర్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు పొందవచ్చని మెడికవర్ ఎంవీపీ కాలనీ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. నలుగురు ఫ్యామిలీకి ఈ కార్డు వర్తిస్తుందని, రూ.5,000 మించే ఫార్మసీ బిల్లులపై 20 శాతం రాయితీ లభిస్తుందని చెప్పారు. ఆస్పత్రి వైద్యులు అరుణ్‌కుమార్, సిహెచ్.ప్రసాద్, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉంటాం



రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర యువజన క్రీడలు, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన నగరంలోని పలు బస్ స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రికి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోషియేషన్ నాయకులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. డివిజన్ కార్యదర్శి శివాజీ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలిపారు. వాల్తేర్ డిపో కార్యదర్శి ఆర్.వసంతరావు, అధ్యక్షుడు పి.జి.పతి, మద్దిలపాలెం అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీ రామారావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి



ఆర్టీసీ ఎండీ, డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ఆర్టీసీ ఉద్యోగులకు 2017 ఆర్‌పీఎస్ ఎరియర్స్ పూర్తిగా చెల్లించాలని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఏపీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావును కోరినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయనను ఎన్‌ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ఆర్.సుబ్బారావు, ఎస్.రాజేష్‌కుమార్, జోనల్ కార్యదర్శి ఎ.రామారావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ బస్ డ్రైవర్లు, కండక్టర్లకు నిలిపివేసిన నైట్ అవుట్ అలవెన్స్‌లు ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎండీకి అసోసియేషన్ రాష్ట్ర కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఆర్‌పీఎస్ ఎరియర్స్ చెల్లింపులు మిగిలిపోయిన ఏపీపీడీలు, ఉద్యోగులకు వెంటనే చెల్లించాలని కోరామన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితికి అనుగుణంగా సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఎండీ హామీ ఇచ్చినట్లు చెప్పారు. అనేక పెండింగ్ అంశాల పరిష్కారానికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని పేర్కొన్నారన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో సంతృప్తికర జీవనం



ప్రవచిస్తున్న సుశీలాజీ

విశాఖ విద్య: సంతృప్తికరమైన జీవనం సాగించేలా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని స్వామి పార్థసారధి శిష్యురాలు, ప్రవచనకర్త సుశీలాజీ పేర్కొన్నారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో భగవద్గీత 10వ అధ్యాయం ‘విభూతియోగం’ మీద ఇంగ్లిష్‌లో ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం (ప్రవచనాలు) కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం ప్రవచనాలు చెప్పారు. శ్రీకృష్ణుడి వివిధ రుపాల్లో ఉన్న అంతులేని దివ్య మహిమలను తెలిపారు. జీవులన్నీ తనలోనే పుట్టి, తనలోనే జీవించి, తనలోనే ఐక్యమవుతాయని శ్రీకృష్ణుడు చెప్పారని వివరించారు. బంగారు ఆభరణాలకు ఏ విధంగా బంగారం మూలమో.. ఆత్మ అన్ని వస్తువులు, ప్రాణులకు మూలమని పేర్కొన్నారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామి పార్థసారధి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. ప్రచనాలకు విచ్చేసిన వారంతా పుస్తక ప్రదర్శనను తిలకించారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, నగర వాసులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలు ప్రారంభం



హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రిలో అంబులెన్స్ ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఆరిలోవ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సరైన సమయంలో వైద్య సేవలందించేలా అంబులెన్స్‌ను అపోలో ఆస్పత్రి సిద్ధం చేసింది. దీనిని శుక్రవారం హెల్త్‌సిటీ అపోలో హాస్పిటల్ ఆవరణలో నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబులెన్స్‌ల ద్వారా రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలందించి అందుబాటులో ఉండే ఆస్పత్రులకు తరలిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ సేవలు అందించడానికి ముందుకొచ్చిన అపోలో యాజమాన్యానికి సీపీ కృతజ్ఞతలు తెలిపారు. మరికొన్ని ఆస్పత్రుల యాజమాన్యాలు ముందుకు రావాలని కోరారు. నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ఈ అంబులెన్స్ సేవలందిస్తుందని చెప్పారు. అంబులెన్స్‌లు 24 గంటలూ సేవలందిస్తూ.. నగరంలోని అన్ని ప్రధాన ఆస్పత్రులకు క్షతగాత్రులను తరలిస్తాయన్నారు. అపోలో అంబులెన్స్ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 84980 91066కు సంప్రదించాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అపోలో సీవోవో రామచంద్రరావు, వైద్యులు, పోలీస్ అధికారులు ఏడీసీపీ ప్రవీణ్, ద్వారకా ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అనుభూతులను నిక్షిప్తం చేసేది చిత్రం



ఫొటోగ్రఫీ ప్రదర్శనను తిలకిస్తున్న సీపీ బాగ్చి

ఏయూ క్యాంపస్: అనుభూతులను నిక్షిప్తం చేసి, మధుర జ్ఞాపకంగా అందించేది ఫొటో గ్రఫీ అని విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. విశాఖ కెమెరా క్లబ్ 25 ఏళ్ల ప్రయాణాన్ని పురస్కరించుకుని బీచ్‌రోడ్డులోని హవా మహల్‌లో ఏర్పాటు చేసిన మూడు రోజుల ఫొటోగ్రఫీ ప్రదర్శనను శుక్రవారం ఆయన ప్రారంభించారు. వైవిధ్యమైన కోణాలలో భిన్న దృశ్యా లను ఆవిష్కరించిన తీరును ప్రశంసించారు. 600 చిత్రాలను ప్రదర్శనకు ఉంచారు. వైల్డ్‌లైఫ్, పక్షులు, వివాహ దృశ్యాలు, గ్లామర్, ట్రావెల్, ఫొటో జర్నలిజం తదితర విభాగాలకు చెందిన పదుల సంఖ్యలో ఫొటోలు ఉన్నాయి. విశాఖ కెమెరా క్లబ్ సభ్యులు ఫొటోల వివరాలతోపాటు, ఫొటోగ్రఫీలో మెలకువలను సైతం తెలియజేస్తున్నారు. క్లబ్ చైర్మన్, ప్రముఖ ఫొటోగ్రాఫర్ బి.కె.అగర్వాల్ మాట్లాడుతూ తరచూ ఔత్సాహికుల కోసం ఫొటోగ్రఫీ తరగతులతో పాటు, 6 అంతర్జాతీయ, 2 జాతీయ ఎగ్జిబిషన్‌లను సైతం నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 22 వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు.

‘నృత్య సమ్మేళనం’ లోగో ఆవిష్కరణ



ఐటీడీసీ లోగో ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

మద్దిలపాలెం: విశాఖ వేదికగా ఈ నెల 27 నుంచి జరగనున్న ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్(ఐటీడీసీ) లోగోను శుక్రవారం ప్రభుత్వ అతిథి గృహంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఐటీడీసీ వ్యవస్థాపకుడు బత్తిన రంగ విక్రమ్‌కుమార్ నృత్య సమ్మేళన వివరాలను మంత్రికి వివరించారు. డాబా గార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మూడు రోజుల పాటు అంతర్జాతీయ నృత్య ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

నేటి నుంచి మహాభారత కథా యజ్ఞం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా శనివారం సాయంత్రం 3 గంటల నుంచి మహాభారత కథా యజ్ఞం జరగనుందని కార్యక్రమ ఉత్తర భారత నిర్వాహకుడు సునీల్ చౌదరి, సమన్వయకర్త సునీల్ బాలాసరియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 వరకు కార్యక్రమం కొనసాగనుండగా.. శనివారం ఉదయం బీచ్ రోడ్డులోని వైఎంసీఏ నుంచి గాదిరాజు ప్యాలెస్ వరకు భక్తులచే కలశ యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా ఏయూ



మాట్లాడుతున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దుతున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌తో శుక్రవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల పర్యవసానాలు, నష్టాలను విద్యార్థులకు వివరించడం, వారిని వీటికి దూరంగా ఉంచడం నిరంతర ప్రక్రియగా కార్యక్రమాలను జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపును స్వీకరిస్తూ డ్రగ్స్ రహితంగా ఏయూను తయారు చేస్తున్నామని చెప్పారు. సంబంధ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆషిమా సలీం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని, వారికి తమ సంస్థ తరఫున ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్లు విద్యార్థుల్లో అవగాహన కలిగించడం, పోస్టర్ తయారీ వ్యాసరచన పోటీలో నిర్వహించడం, అవగాహన ర్యాలీలు, సిగ్నేచర్ క్యాంపెయిన్ వంటివి చేపట్టాలని సూచించారు. డ్రగ్ కంట్రోల్ చాంపియన్‌గా యువతను గుర్తించి వారి ద్వారా సమాజంలో విస్తృతమైన చైతన్యం తీసుకురావాలని కోరారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఎ.నరసింహారావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారు విద్యపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆరిలోవ: వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుపైనా బిల్లు తీసుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ ప్రెసిడెంట్ తనూజరెడ్డి, డీఎస్‌వో భాస్కర్ తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారు విద్యపై అవగాహన కల్పించారు. బాధ్యత గల విద్యార్థిగా సమాజంలో మెలుగుతానని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినియోగదారులు ఏ వస్తువు కొన్నా దానిపై బిల్లు తీసుకొని రెండేళ్ల పాటు జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. కొనే వస్తువులో లోపం ఉన్నట్లయితే ఆ బిల్లు ద్వారా దానికి రక్షణ కలుగుతుందన్నారు. వినియోగదారుల హక్కుల గురించి తెలుసుకొని తల్లిదండ్రులకు, చుట్టుపక్కల వారికి అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 21న క్వీన్ మేరీ హైస్కూల్‌లో ఉదయం 10 గంటలకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, లీగల్ మెట్రోలజీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కన్స్యూమర్ కన్వీనర్ స్వామినాయుడు, జిల్లా వినియోగదారుల సంఘాల సమైక్య చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



పోటీలకు ఎంపికైన జిల్లా పురుషులు, మహిళల కబడ్డీ జట్లు

ఎంవీపీకాలనీ : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో ఈ నెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న 51వ రాష్ట్ర స్థాయి జూనియర్ అంతర్ జిల్లాల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురుషుల జట్టుకు కోచ్‌గా పి.చైతన్య, కెప్టెన్‌గా సాయి వ్యవహరించనుండగా ఓ.శ్రీను, ఎస్‌డీ మున్నా, బి.ప్రసాద్, కె.వంశీ, ఎన్.అయ్యప్ప, బి.హేమంత్‌కుమార్, బి.శ్రీను, కె.పృథ్వీ, కె.మహేష్, ఎస్.యోగి, అభిషేకుమార్ సభ్యులుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహిళల జట్టుకు కోచ్‌గా కె.లక్ష్మణరావు, కెప్టెన్‌గా కె.మౌనిక వ్యవహరించనుండగా ఐ.మేఘన, శ్రిష్టికుమారి, కె.మాధవి, పి.ద్రాక్షాయణి, సి.భవ్యశ్రీ, వై.కోమలి, బి.దివ్య, ఆర్.స్వప్న, బి.హాసిని, ఎం.శ్రీలక్ష్మి, ఏ.మేఘన ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారులకు అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఎస్.రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు వి.కృష్ణ, జాయింట్ సెక్రటరీ సీహెచ్ గోవింద్, కోశాధికారి లక్ష్మణమూర్తి, సురేష్ తదితరులు అభినందనలు తెలిపారు.

ఏయూలో క్రిస్మస్ వేడుకలు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ప్రీ కిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు వివిధ వేషధారణల్లో క్రిస్మస్ గీతాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి అందరికీ పంచారు. డాక్టర్ అనిలా నాయర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్ పద్మశ్రీ, ప్రొఫెసర్ బి.ప్రజ్ఞా, డా.అరుణ తదితరులు క్రిస్మస్ సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు. విద్యార్థులు గిటార్ సంగీతంతో కరోల్స్ పాడి అలరించారు.